సార్ మా కాలనీలో అన్నీ సమస్యలే..

- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డితో హిల్ కాలనీ మహిళ

సాగర్ హిల్ కాలనీలో ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డితో మాట్లాడుతున్న లక్ష్మమ్మ

హాలియా, ఏప్రిల్ 4 : నాగార్జున సాగర్ హిల్‌కాలనీ మొదటివార్డులో కోతుల మృతిచెందిన వాటర్‌ట్యాంక్, కాలనీని గురువారం మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు నోముల భగత్‌కుమార్, రవీంద్రకుమార్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక మహిళ మల్లేపల్లి లక్ష్మమ్మ మాట్లాడుతూ తాగునీరు సక్రమంగా రావడం లేదని, రోడ్డు కూడా సక్రమంగా లేదని జగదీశ్‌రెడ్డికి విన్నవించారు. పక్కనే పెద్ద నది పెట్టుకొని తాగునీటి సమస్య ఉండంటే ఎవరూ నమ్మరు. కానీ ఇక్కడ తాగేందుకు మంచినీళ్లు కరువు, రోజు మరిచి రోజు నీళ్లు వస్తాయి. ట్యాంకులో కోతులు చనిపోయినప్పటికీ ఆ నీళ్లనే తాగేందుకు ఇచ్చారు. వాటిని అన్ని పనులకు వాడుకున్నాం. ఇప్పటి వరకు ఏమీ కాలేదు. రేపటివరకు ఉంటామో పోతమే తెలియదూ అని జగదీశ్‌రెడ్డితో వాపోయింది. దాంతో ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ అధైర్యపడాల్సిన పనిలేదని, అందరికీ వైద్య పరీక్షలు చేయించమని ప్రభుత్వాన్ని కోరినట్లు చెప్పారు. ఇక్కడి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

కోతులు మృతి చెందిన ట్యాంకు ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి పరిశీలన

- కాలనీవాసులకు ప్రత్యామ్నాయ ఏర్పాటుకు ఆదేశం

సాగర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి

హాలియా. ఏప్రిల్ 4 : నాగార్జున సాగర్ హిల్‌కాలనీలో కోతులు మృతి చెందిన వాటర్ ట్యాంక్‌ను ఎమ్మెల్యే జయవీర్ రెడ్డి, అధికారులు గురువారం పరిశీలించారు. ట్యాంక్ నుంచి నీటిసరఫరా నిలిపివేయించడంతో పాటు కాలనీవాసులకు ప్రత్యామ్నాయ పద్ధతిలో తాగు నీటి సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ మూగజీవాలు వాటర్ ట్యాంకులో పడి మృతి చెందడం దురదృష్టకరం అన్నారు. ట్యాంకులో కోతులు మృతి చెందిన విషయం తెలియగానే అధికారులు నీటిసరఫరా నిలిపివేశారని చెప్పారు.

కేసు నమోదు

నాగార్జున సాగర్ నీటి ట్యాంకులో కోతులు మృతి చెందిన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఏఈ భిక్షం మరో ఇద్దరు వర్కర్స్‌పై ఐపీసీ సెక్షన్ 269 కింద కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

మున్సిపల్ అధికారులకు తెలిపినా స్పందన లేదు

ఈ నెల 2న రెండు కోతుల కళేబరాలు నీటిలో ఉబ్బి బయటకు రావడంతో వాసన కోడుతుండడంతో నేనే తీసి పక్కకు పారవేశాను. మున్సిపల్ సిబ్బందికి తెలిపినా స్పందన లేదు. బుధవారం సాయంత్రం మున్సిపల్ సిబ్బంది వచ్చి 30 నుంచి 40 కోతుల కళేబరాలను తీసి పారేశారు.

–హనుమంతు, స్థానికుడు

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

- డిండి మండల సమావేశంలో ఎంపీపీ సునీతాజనార్దన్‌రావు

సమావేశంలో మాట్లాడుతున్న సునీత

డిండి, ఏప్రిల్ 4 : వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ మాధవరం సునీతాజనార్దన్‌రావు సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం మం డల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. సమావేశంలో ప్రధానంగా ప్రజలకు ఇబ్బంది కలుగకుండా మంచినీటి సరఫరా చేయాలని అందుకుగాను అమలు చేయాల్సిన విధానాలను చర్చించారు. ఎలాంటి తీర్మానాలు లేకుండానే మండల సమావేశం ముగిసింది. కార్యక్రమంలో ఎంపీడీఓ దానేల్, వైస్ ఎంపీపీ పుల్లమ్మ, ఎంపీటీసీలు రాధిక, సూర్యానాయక్, వెంకటయ్య, మండల కోఆప్షన్ సభ్యుడు జహంగీర్, అధికారులు పాల్గొన్నారు.

పైప్‌లైన్‌కు మరమ్మతు

చిట్యాల, ఏప్రిల్ 4 : చిట్యాలలోని జడ్పీహెచ్‌ఎస్ వద్ద మెయిన్ వాటర్ పైపు లైనులో సమస్య తలెత్తింది. దాంతో మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డిస్పందించి వెంటనే దగ్గర ఉంచి గురువారం మరమ్మతు పనులు చేయించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ పైపు లైన్లలో ఎలాంటి లీకేజీలు లేకుండా చూస్తున్నామని, ఇతర ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు.

కార్యక్రమంలో కౌన్సిలర్లు రెముడాల లింగస్వామి, బెల్లి సత్తయ్య, నాయకులు జిట్ట చంద్రకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

పైపు లైను మరమ్మతు పనులను పరిశీలిస్తున్న చైర్మన్ వెంకట్‌రెడ్డి

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

FLAT FOR SALE
★Ready to Move: Hayathnagar Near Vijayawada Highway Beside Bus Stop Sup. Luxurious 3BHK Flats, 2 Side 30' Rd. Ph: 9247326642 / 9849801477.
NT-327957

WANTED
★Wanted Agents, Associates Franchise throughout Telangana for Abroad Medical College Admission. 8881116865 / 8881115253.
NT-311882-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines, Extra Line - Extra Amount
5% GST అదనం
పూర్తి వివరాలకు :
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, గ్రా: చర్లపల్లి, మం: నల్లగొండ.

నల్లగొండ : 9182777626	నల్లగొండ : 9182777635	దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059	సూర్యాపేట : 9182777630	భువనగిరి : 9182777638
మిర్యాలగూడ : 9182777059	కోదాడ : 9182777196	చౌటుప్పల్ : 9182777638

వేసవిలో తాగునీటి సమస్య రాకుండా చూడాలి

- ప్రతి నీటి వనరును శుభ్రం చేసి క్లోరినేషన్ చేయాలి
- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్

సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ అనితారామచంద్రన్, పక్కన కలెక్టర్ హరిచందన

నల్లగొండ, ఏప్రిల్ 4 : జిల్లా వ్యాప్తంగా ప్రజలు తాగునీటి సమస్య రాకుండా ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేయాలని నల్లగొండ జిల్లా తాగు నీటి సరఫరా ప్రత్యేకాధికారి, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ అనితా రామచంద్రన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో బుధవారం జిల్లాలోని గ్రామీణ పట్టణ, ప్రాంతాల్లో తాగునీటి సరఫరాపై మిషన్ భగీరథ, మున్సిపల్, ఇంజనీరింగ్, ఎంపీడీఓలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవిలో ప్రజలు ఇబ్బంది పడకుండా ప్రతి ఇంటికి మిషన్ భగీరథ తాగునీరు వెళ్లాలని, ఇంజినీరింగ్ అధికారులు, ఎంపీఓ, ఎంపీడీఓలు క్షేత్రస్థాయిలో గ్రామాల్లో పర్యటించి తాగునీటి సమస్యలు లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. ఎక్కడైనా తాగునీటి సమస్య ఉత్పన్నమైతే తక్షణమే పరిష్కరించాలని అన్నారు. అన్ని తాగునీటి వనరులను శుభ్రం చేయించడంతోపాటు, తప్పనిసరిగా క్లోరినేషన్ చేయాలని చెప్పారు. మండలాల ప్రత్యేకాధికారులు, ఇంజనీరింగ్ అధికారులు పురోగతిలో ఉన్న తాగునీటి పనులన్నింటిని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని, గ్రామాల వారిగా పనులను సమీక్షించాలని అన్నారు. అంతకు ముందు జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన జిల్లాలో తాగునీటి సరఫరా పరిస్థితిపై వివరాలను అందజేశారు. జిల్లాలో 884 రెవెన్యూ గ్రామాలు, 1744 హాబిటేషన్లలో తాగునీటిని సరఫరా చేస్తున్నామని, మూడు లక్షల 78,000 ఇండ్లకు తాగునీటి సరఫరా చేస్తుండగా, పట్టణ ప్రాంతంలో ప్రతిరోజు 68 ఎంఎల్‌డీ నీటిని సరఫరా చేస్తున్నామని తెలిపారు.

నల్లగొండ పట్టణానికి ఉదయ సముద్రంలో సరిపోయినంత తాగునీరు ఉందన్నారు. ఇటీవలే అన్ని బోర్లను ఫ్లషింగ్ చేయించినట్లు చెప్పారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పూర్ణచందర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ వెంకటేశ్వర్లు, డీఆర్డీఓ నాగిరెడ్డి, డీపీఓ మురళి, జడ్పీ సీఈఓ ప్రేమ్ కరణ్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్లు ఇంజినీరింగ్ అధికారులు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలకు సౌకర్యాలు కల్పించాలి

- డీఆర్‌డీఓ నాగిరెడ్డి

ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్న డీఆర్డీఓ నాగిరెడ్డి

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 4 :ఉపాధి హామీ కూలీలకు పని వద్ద సౌకర్యాలు కల్పించాలని డీఆర్‌డీఓ నాగిరెడ్డి పేర్కొన్నారు. నార్కట్‌పల్లిలోని చెరువు పూడిక తీత పనులను గురువారం ఆయన పరిశీలించి కూలీలతో మాట్లాడారు. రోజుకు రూ. 300లు చొప్పున కూలీ రావాలంటే ఎంత పని చేయాలి అనే అవగాహన ఉండాలి అని అడిగి తెలుసుకున్నారు. అలాగే వేసవిని దృష్టిలో ఉంచుకొని ఎండలు విపరీతంగా ఉన్నందున ఉదయం 7 గంటలకు పనికి హాజరై కొలతల ప్రకారం పని చేసుకొని తిరిగి వెళ్లాలని సూచించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లను కూలీలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ పీడీ నవీన్, ఏపీడీ ఉపేందర్ రెడ్డి, ఎంపీడీఓ ఉమేశ్, శ్రీరాములు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్షలను పటిష్టంగా నిర్వహించాలి

సిద్ధార్థ కళాశాలలో పరీక్షలు తనిఖీ చేస్తున్న రిజిస్ట్రార్ రవి

రామగిరి, ఏప్రిల్ 4: మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న డిగ్రీచ బీఈడీ, బీపీఈడీ పరీక్ష కేంద్రాలను ఎంజీయూ రిజిస్ట్రార్ అల్వాల రవి గురువారం తనిఖీ చేశారు. నల్లగొండలోని సిద్ధార్థ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో నిర్వహిస్తున్న డిగ్రీ ఇయర్ వైజ్ పరీక్షలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎక్కడ ఎలాంటి పొరపాట్లు లేకుండా చూడాలని పటిష్టంగా నిర్వహించాలని సూచించారు. ఆయన వెంట ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాస్, అకాడమిక్ డైరెక్టర్ గుండెబోయిన జానయ్యయాదవ్ తదితరులు న్నారు.

గ్రంథాలయానికి పుస్తకాల అందజేత

పుస్తకాలు అందజేస్తున్న కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి

మునుగోడు,ఏప్రిల్ 4: మునుగోడు జడ్పీ ఉన్నత పాఠశాల గ్రంథాలయానికి రచయిత, ప్రముఖ బాల సాహితీ వేత్త కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి గురువారం తాను రాసిన బంతిపూలు, బహుమతి బాలల కథల పుస్తకాలతో పాటు ఇతర బాలసాహిత్య పుస్తకాలను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలసాహిత్య పుస్తకాలు చదవడం ద్వారా విద్యార్థుల నైతిక విలువలతో పాటు మానసిక వికాసం చెందుతారని అన్నారు. దాంతో విద్యార్థులకు పుస్తక పఠనం అలవడుతుందని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం యాదయ్యగౌడ్, భూతరాజు అంజయ్య, చంద్రం, పిండి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

ఇఫ్తార్‌విందులో పాల్గొన్న ముస్లింలు

రామగిరి, ఏప్రిల్ 4: టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఆ సంఘం జిల్లా కార్యాలయంలో గురువారం రాత్రి ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. మౌలానా వాహిద్ సాబ్ , ఖాదర్ సాబ్‌లు హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సైదులు, పెరుమాళ్ల వెంకటేశం, కోశాధికారి నర్రా శేఖర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శులు నర్సింహ, నలపరాజు వెంకన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వే బ్రిడ్జి నిర్వాహకులపై కేసు నమోదు

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 4 : మండలంలోని అమ్మనబోలు గ్రామంలోని అరుణ వే బ్రిడ్జిని జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి పి.రామకృష్ణ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వే బ్రిడ్జిలోవెయ్యి కేజీలకు గాను 5 కేజీలు తేడా చూపిస్తున్నదని, వే బ్రిడ్జి ఇండికేటర్‌కు వెరిఫికేషన్ సీల్ లేదని, ఎలాంటి వెరిఫికేషన్ లేకుండా ఒక టన్ను వరకు వరి ధాన్యాన్ని కొనుగోలు చేస్తూ రైతులను మోసం చేస్తున్నట్లుగా గుర్తించినట్లు తెలిపారు.

దాంతో వే బ్రిడ్జికి సంబంధించిన మిర్యాల శ్రీహరి, జంగిలి నర్సింహ, బుర్రి షెట్టి, కార్తీక్‌పై స్టేషన్‌లో ఫిర్యాదు ఇవ్వగా కేసు నమోదైనట్లు పేర్కొన్నారు.

మూల్యాంకనానికి హాజరు కాని ఉపాధ్యాయులపై చర్యలు : డీఈఓ

రామగిరి, ఏప్రిల్ 4: పదో తరగతి మూల్యాంకనానికి అసిస్టెంట్ ఎగ్జామినర్స్‌గా ఉత్తర్వులు పొంది ఈనెల 3న రిపోర్టు చేయని ఉపాధ్యాయులకు చర్యలు తీసుకుంటామని డీఈఓ బి.భిక్షపతి వెల్లడించారు. 865మందికి అసిస్టెంట్ ఎగ్జామినర్స్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసినప్పటికీ దాదాపుగా 350మంది హాజరుకాలేదని, వీరు 3,4 తేదీల్లో మూల్యాంకనానికి హాజరు కాలేదని, వీరందరూ 5వ తేదీ ఉదయం 9గంటల లోపు మూల్యాంకనానికి హాజరు కావాలని సూచించారు. లేని పక్షంలో విద్యాశాఖ నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పలు కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు పరామర్శ

మిర్యాలగూడ రూరల్, ఏప్రిల్ 4 : మండలంలోని లావూడితండాకు చెందిన బీఆర్ఎస్ మండల నాయకుడు లావూడి శ్రీహరినాయక్ తల్లి హుస్సేనమ్మ అనారోగ్యంతో గురువారం మృతి చెందింది. మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు గ్రామానికి వెళ్లి హుస్సేనమ్మ మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట నల్లగొండ రైతు బంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు స్కైలాబ్, హర్యానాయక్, మాజీ ఎమ్మెల్యే భారతీరాగ్యానాయక్, దాస్య, నాగు నాయక్ ఉన్నారు.

- వేములపల్లి : మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు జడ మట్టయ్య తల్లి లింగమ్మ అనారోగ్యంతో గురువారం మృతిచెందారు. మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు లింగమ్మ మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి సానుభూతిని తెలిపారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నామిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ చిర్ర మల్లయ్యయాదవ్, నాయకులు కట్టా మల్లేశ్‌గౌడ్, నాగవెల్లి శంకర్, పందిరి ప్రతాప్, కాట్రగడ్డ రాజగోపాలరావు, నాగవెల్లి యాదగిరి, అమరారపు తిరుమలేశ్, సందీప్, దైద జాన్సన్, ఎంపీటీసీ నంద్యాల శ్రీరాంరెడ్డి, శంకర్, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలి

శాలిగౌరారం, ఏప్రిల్ 4: నాగారం మండలం ఫణిగిరిలో శనివారం నిర్వహించనున్న బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం విజయవంతం చేయాలని ఆ పార్టీ మండలాధ్యక్షుడు ఐతగోని వెంకన్నగౌడ్ తెలిపారు. మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించనున్న సమావేశానికి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

చిట్యాల, ఏప్రిల్ 4 : గుండ్రాంపల్లి పీఏసీఎస్ ఆధ్వర్యంలో గుండ్రాంపల్లి, సుంకెనపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మానిటరింగ్ అధికారి వంగూరు విజయకృష్ణ గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ కార్యదర్శి రాజమల్లయ్య, సిబ్బంది రాకేశ్, అరవింద్, మహేశ్, విజయ్ పాల్గొన్నారు.

గుండ్రాంపల్లిలో నేటి నుంచి కంటి వైద్య శిబిరం

చిట్యాల, ఏప్రిల్ 4 : మండలంలోని గుండ్రాంపల్లి గ్రామంలో ఏసిరెడ్డి శ్రీరామ్ రెడ్డి, ఏసిరెడ్డి కృపాకర్‌రెడి జ్ఞాపకార్థం చెన్నైకి చెందిన శంకర్ నేత్రాలయం, అమెరికన్ తెలుగు అసోసియేషన్(ఏటీఏ)ల సౌజన్యంతో శుక్రవారం నుంచి ఈ నెల 12 వరకు కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు,ఉమ్మడి నల్లగొండ జిల్లా డీసీసీబీ వైస్ చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గుండ్రాంపల్లిలోని రైతు వేదిక వద్ద ఈ నెల 5 నుంచి 11 వరకు కంటి శుక్లం పరీక్షలు, అనంతరం అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కంటి వైద్య పరీక్షలకు వచ్చేవారు ఆధార్ కార్డును తీసుకురావాలని సూచించారు. ఇతర వివరాల కోసం 9840087389,6380515583,9791102648 నంబర్‌లలో సంప్రదించాలని దయాకర్‌రెడ్డి కోరారు.

బీసీ కుల సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడిగా రవి

నీలగిరి, ఏప్రిల్ 4 : బీసీ కుల సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడిగా పాలకూరి రవి గౌడ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సంఘం కొత్త కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలు కలిసికట్టుగా ఉంటూ సమస్యల పరిష్కారానికి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ రాజ్యాధికార సమితి జిల్లా అధ్యక్షుడు కర్నాటి యాదగిరి, నరసింహ చారి, చెరుకు మల్లికార్జున్ గౌడ్, జక్కల సుధాకర్ యాదవ్, బాసాని నరసింహ, నాగోజు నరేశ్ చారి, శ్రీశైలం యాదవ్, శ్రీపాద జైశ్రీరామ్, కొండోజు వేణు, గడగోజు విజయ్, వేముల దశరథ గౌడ్ పాల్గొన్నారు.

ముగిసిన జాతీయ నాటకోత్సవాలు

- విజేతలకు ఎమ్మెల్యే బీఎల్ఆర్ బహుమతులు అందజేత

ప్రథమ బహుమతిగా నిలిచిన మాధవవర్మ పద్యనాటిక కళాకారులకు మెమెంటో, నగదును అందజేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ, ఏప్రిల్ 4: రాష్ట్ర భాషా సాంస్కృతిశాఖ, మిర్యాలగూడ సాంస్కృతి కళా కేంద్రం సంయుక్తంగా ఆరు రోజులుగా పట్టణంలోని కేసీఆర్ కళాభారతిలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి పద్య, సాంఘిక నందిని నాటకాలు గురువారం ముగిశాయి. ఆరో రోజు రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సంగనభట్ల నరసయ్య, సీనియర్ రంగస్థల నటుడు నూకల జానకిరాములు ముఖ్య అతిథులుగా హాజరై నాటకోత్సవాలను ప్రారంభించారు. పల్నాడు జిల్లా మిట్టపాలెంకు చెందిన టి.కృష్ణ థియేటర్ వారిచే 'ప్రేమించే వయసేన' అనే సాంఘిక నాటిక, గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన అరవింద ఆర్ట్స్ వారిచే 'జరుగుతున్న కథ' అనే సాంఘిక నాటిక ప్రేక్షకులను అలరించాయి. ముగింపు వేడుకలకు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి హాజరై ప్రతిభ కనబరిచిన కళాకారులకు మెమెంటోలు, నగదు పురస్కారాలు అందచేశారు. ఉత్తమ జ్యూరీ ప్రదర్శనగా స్వామి అయ్యప్ప, ఉత్తమ ద్వితీయ ప్రదర్శనగా శ్రీకృష్ణ కర్ణార్జునీయం, ఉత్తమ తృతీయ ప్రదర్శనగా మైరావణ, ఉత్తమ ప్రదర్శనగా మాధవవర్మ నిలవగా ఉత్తమ రంగాలంకరణగా సురభి సంతోష్, ఉత్తమ ఆహార్యంగా చింతా శ్రీనివాస్, ఉత్తమ సంగీతం విభాగంలో ఎ.శివసుబ్రహ్మణ్యం, జ్యూరీలుగా హారిక, చాగంటి సాయిలక్ష్మీతోపాటు మరికొంతమందికి మెమె ంటోలు, నగదును అందజేశారు. కార్యక్రమంలో మిర్యాలగూడ సాంస్కృతిక కళా కేం ద్రం వ్యవస్థాపక అధ్యక్షుడు తడకమళ్ల రామచంద్రరావు, అధ్యక్షుడు బోయినపల్లి భుజంగరావు, ప్రధాన కార్యదర్శి పులి కృష్ణమూర్తి, కోశాధికారి పుల్లాభట్ల లక్ష్మీనారాయణ శర్మ, గ్యార సాయిలు చంద్రశేఖర్‌రావు, జానకీరామశర్మ, ఇనాయతుల్లా, దుర్గి శ్రీనివాస్ శర్మ, పరమి రామావతారం, మామిడాల ఉపేందర్, బాబురావు, బాపనయ్య, రాఘవయ్య, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

శిక్షణకు గైర్హాజరైన అధికారులకు షోకాజ్ నోటీసులు..!

- ఆదేశాలు జారీ చేసిన కలెక్టర్

నకిరేకల్, ఏప్రిల్ 4 : ఈ నెల 2న నకిరేకల్ నియోజకవర్గ పరిధిలోని 61 మంది ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు ఎన్నికల నిర్వహణపై శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కొందరు అధికారులు గైర్హాజరయ్యారు. దాంతో నమస్తే తెలంగాణ దినపత్రిలో 'ఎన్నికల శిక్షణకు అధికారుల గైర్హాజరు'పై కథనం ప్రచురించతమైంది. దాంతో కలెక్టర్ హరిచందన స్పందించారు. శిక్షణకు గైర్హాజరైన అధికారులకు షోకాజ్ నోటీసులు పంపించాలని అడిషనల్ కలెక్టర్, నకిరేకల్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పూర్ణచందర్‌కు కలెక్టర్ ఆదేశాలు జారీచేశారు. గురువారం నకిరేకల్ నియోజకవర్గకేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఓపీఓలకు ఎన్నికల శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కానీ పీఓ, ఏపీఓలకు అవకాశం ఇవ్వలేదు. నకిరేకల్ తో పాటు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో గైర్హాజరైన అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కాగా జిల్లాలో 4,740 మంది పీఓ, ఏపీఓలు హాజరు కావాల్సి ఉండగా 4,064 మంది మాత్రమే హాజరయ్యారు. 676 మంది అధికారులు గైర్హాజరైనట్లు సంబంధిత ఆర్‌ఓలు కలెక్టర్‌కు నివేదించగా వారందరికీ షోకాజ్ నోటీసులు జారీచేయాలని ఆదేశించినట్లు సమాచారం.

ఈ విషయమై నకిరేకల్ నోడల్ అధికారి మధుసూదన్‌రెడ్డిని నమస్తే తెలంగాణ ప్రశ్నించగా...షోకాజ్ నోటీసులు జారీచేయాలని ఆదేశాలు వచ్చాయి. కలెక్టరేట్ నుంచి నోటీసులు వస్తే సంబంధిత గైర్హాజరు అధికారులకు అందజేస్తామని తెలిపారు. శనివారం కూడా శిక్షణ కార్యక్రమం ఉంటుంది..ఆ రోజు ఏమైనా వారికి అవకాశం కల్పిస్తారా అనేది జిల్లా అధికారులు నిర్ణయం తీసుకుంటారని తెలిపారు.

పోలీస్ అమరులను స్మరించుకోవాలి :ఎస్ఐ

నాగరాజు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్ఐ శ్రీను, స్థానిక ప్రజాప్రతినిధులు, పోలీస్ సిబ్బంది

కట్టంగూర్, ఏప్రిల్ 4 : పోలీస్ అమరులను స్మరించుకోవాలని ఎస్ఐ ఎన్. శ్రీను అన్నారు. సీపీ ఉగ్రవాదుల కాల్పుల్లో మృతి చెందిన కానిస్టేబుల్ చెవుగోని నాగరాజు 9 వర్ధంతిని మండలంలోని అయిటిపాములలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీను స్థానిక ప్రజాప్రతినిధులు, పోలీస్ సిబ్బందితో కలిసి నాగరాజు విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శ్రీమన్నారాయణ, పెద్ది సుక్కయ్య, చౌగోని నాగరాజు, లతీఫ్‌ఖాన్, పబ్బు వెంకన్న, కొమ్ము కోటి, సున్నపు సైదులు, ముత్యాల లింగయ్య, సైదులు సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి జిజ్ఞాస పోటీల్లో కేఎన్ఎం విద్యార్థుల ప్రతిభ

విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

మిర్యాలగూడ, ఏప్రిల్ 4: రాష్ట్ర స్థాయి జిజ్ఞాస పోటీల్లో స్థానిక కేఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ భిక్షమయ్య తెలిపారు. 'అప్లికేషన్స్ ఆఫ్ డిఫరెన్షియల్ ఈక్వేషన్స్' అనే అంశంతోపాటు'నాగార్జున సాగర్ వద్ద బౌద్ధ మత స్థలాలు' అనే అంశంపై గణిత శాస్త్రం, చరిత్ర విద్యార్థులు ప్రజెంటేషన్ ఇచ్చినట్లు తెలిపారు. ఈ పోటీల్లో కళాశాలకు చెందిన విద్యార్థులు రెండు సబ్జెక్టుల్లో ఉత్తమ ప్రజెంటేషన్ ఇచ్చి సర్టిఫికెట్లు అందుకున్నట్లు తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఆయన కళాశాలలో అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు నర్సింగ్ కోటయ్య, నాగ రేఖా రాణి ఉన్నారు.

ధాన్యం తూకాల్లో తేడాలు

- కొనుగోలు కేంద్రంలో మోరాయిస్తున్న ఎలక్ట్రికల్ కాంటాలు

నకిరేకల్, ఏప్రిల్ 4 : ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు మొరాయించడం, తూకంలో తేడా చూపిస్తుండడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మండలంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో గోరెంకలపల్లి, మంగళపల్లి, నెల్లిబండ, చీమలగడ్డ, తాటికల్.. నకిరేకల్ రైతు ఉత్పత్తిదారుల కంపెనీ ఆధ్వర్యంలో చందంపల్లి, కడపర్తి.. ఐకేపీ ఆధ్వర్యంలో నోముల, వల్లభాపురం, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో టేకులగూడెంలో మొత్తంగా 10 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాలకు నకిరేకల్ మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో 182 ఎలక్ట్రికల్ కాంటాలను అందించారు. అయితే.. తాటికల్ సెంటర్‌లో బుధవారం కాంటాలు మొరాయిస్తున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేయడంతో కాంటాలు ఆపేశారు. గురువారం కూడా ధాన్యం కాంటా వేసేటప్పుడు కిలో, అరకిలో తేడా వస్తుందని రైతులు తెలిపారు. ఈ విషయమై సెంటర్ నిర్వాహకులను ప్రశ్నించగా మార్కెట్ అధికారులు చెక్ చేసి ఇవ్వలేదని సమాధానం చెబుతున్నారు. కేంద్రాల్లో కాంటాలు పాడైతే ఒక్కో కాంటాకు రూ.300 నుంచి రూ.500 ఖర్చు భరించాల్సి వస్తుందని సెంటర్ ఇన్‌చార్జీలు పేర్కొంటున్నారు. దీనిపై వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి శ్రీనాథరాజు మాట్లాడుతూ రూ.1.50 లక్షలతో 182 కాంటాలు రిపేర్ చేసి పంపించామన్నారు. ప్రతి కాంటాను సెంటర్ ఇన్‌చార్జీల సమక్షంలో చెక్ చేసిన తరువాతే వారికి అప్పగిస్తామని చెప్పారు. హమాలీలు అడ్డగోలుగా కాంటాలను లాక్కెళ్తారని, సెంటర్‌లో పాడైన కాంటాలకు తమకు సబంధం లేదని అన్నారు. కాంటాల మొరాయింపు, తూకాల తేడాలపై బాధ్యత మార్కెట్ వాళ్లదా.. సెంటర్ ఇన్‌చార్జిలదా.. హమాలీలదా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఏదేమైనా తూకాల తేడాలతో తాము మోసపోతున్నామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

తాటికల్‌లో ఏర్పాటు చేసిన పీఏసీఎస్ కొనుగోలు కేంద్రం